# సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023




**సొంతిల్లులా.. సౌకర్యంగా..**

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులు ఇక్కడి వసతులు, అందిస్తున్న ఆహారంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



**'ఉన్నతి'తో సాధికారత**

ఎస్సీ, ఎస్టీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఉన్నతి పథకం ద్వారా ఆటో రిక్షాలు అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. 8లో ▸

**శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.55 కోట్లు**

ద్వారకాతిరుమల చినవెంకన్న హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 17 రోజులకు నగదు రూపంలో రూ.1.55 కోట్లు, 159 గ్రాముల బంగారం, 3.650 కిలోల వెండి లభించింది.



8లో

## న్యూస్‌రీల్

### సెక్టార్ అధికారులు కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది కీలక పాత్ర అని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఏ దశలోనూ తప్పిదం జరగకూడదన్నారు. ఒక్కో సెక్టార్ అధికారికి 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందన్నా రు. వీరు పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతులను, ఓటర్లకు అనుకూలతలను పరిశీలించాలన్నా రు. అలాగే సోషల్, కమ్యూనిటీ, పొలిటికల్, లా అండ్ ఆర్డర్ వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో పరిశీలించాలన్నారు. గ్రామాల్లో ఆయా వర్గాలతో సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించాలన్నారు. నివేదిక ఇచ్చే ముందు అన్ని కోణాల్లో పరిశీలించాలన్నారు. ఎన్నికలకు ప్రధానంగా ఎలక్ట్రోరల్, ఈవీఎం, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది కీలకమన్నారు. ప్రస్తుతం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పరిశీలన జరుగుతుందని, తుది ఓటర్ల జాబితా వచ్చేనెల 5న ప్రకటిస్తామన్నారు. ఇప్పటికే ఈవీఎంల మొదటి దశ తనిఖీ పూర్తయ్యిందన్నారు.

**పూర్తి అవగాహన అవసరం**

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ సెక్టార్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల సజావుగా నిర్వహించడంలో సెక్టార్ అధికారుల పాత్ర ముఖ్యమన్నారు. శిక్షణ సామగ్రి, చేయాల్సిన, చేయకూడని, చెక్ లిస్టు, హ్యాండ్ బుక్‌లను అందిస్తామన్నారు. వారి పరిధిలోని పోలింగ్ స్టేషన్లను సందర్శించి ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతుల విషయంపై లోటుపాట్లు గుర్తించి తెలియజేయాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లకు విధుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

### తణుకు ప్రభుత్వ కళాశాలకు అవార్డులు



షేక్ సహీరా రేష్మా

తణుకు టౌన్: రాష్ట్ర కళాశాల విద్యాశాఖ నిర్వహించిన అకడమిక్ ఫెస్ట్‌లో తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడు విభాగాల్లో రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాల్లో రాష్ట్రస్థాయిలో తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి స్థానంలో నిలిచిందన్నారు. బీఏ ప్రోగ్రాంలో హెచ్‌ఈపీ గ్రూపునందు షేక్ సహీరా రేష్మా అనే విద్యార్థిని రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. నాక్ గ్రేడింగ్‌లో కళాశాల 3.18 సీజీపీఏతో రాష్ట్రంలోనే మంచి స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని రేష్మాని అభినందించారు. కళాశాల ప్రగతికి కృషి చేస్తున్న కళాశాల అధ్యాపక సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు.

### విద్యుత్ సమస్యల పరిష్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మిచాంగ్ తుపాను కారణంగా తలెత్తిన విద్యుత్ సమస్యలను అత్యంత తక్కువ సమయంలోనే పరిష్కరించామని ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే ఏలూరులో ప్రత్యేక కంట్రోల్ రూమ్ నంబర్ 94409 02926లో లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1912లో సంప్రదించాలని సూచించారు. తుపాను కారణంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 33/11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 23, 33 కేవీ ఫీడర్లు 14, 11 కేవీ ఫీడర్లు 82, 33 కేవీ విద్యుత్ స్తంభాలు 13, 11 కేవీ విద్యుత్ స్తంభాలు 625, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు 304, విద్యుత్ పరవర్తకాలు 201 దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. 95 శాతం సమస్యలను పరిష్కరించామని, ఇంకా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు.

### 15 రోజుల్లో వైఎస్సార్ బీమా

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ బీమా పథకంలో నమోదై మరణించిన వారి వివరాలు కుటుంబ సభ్యుల ద్వారా సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయానికి తెలియపర్చిన సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో క్లయిమ్ నమోదు చేయగా, డీఆర్‌డీఏ కాల్ సెంటర్ ద్వారా పరిశీలించిన అనంతరం జీఎస్‌డబ్ల్యూ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, బీమా కంపెనీ వారిచే 15 రోజుల్లో క్లయిమ్‌లు పరిష్కరించనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తెలిపారు. క్లయిమ్‌కు సంబంధించి నామినీ బ్యాంకు ఖాతాకు నగదు డిపాజిట్ చేస్తారన్నారు. గతంలో ప్రైవేట్ బీమా కంపెనీల ద్వారా అమలు చేశారని, అయితే క్లయిమ్‌ల పరిష్కారంలో తీవ్ర జాప్యం వల్ల బాధిత కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వైఎస్సార్ బీమా పథకాన్ని ఈ ఏడాది జూలై 15 నుంచి నేరుగా అమలు చేస్తోందన్నారు.

# పంటల రక్షణ.. నష్ట నివారణ

**సాయం.. శరవేగం**

- ముమ్మరంగా సహాయక చర్యలు
- పంటను కాపాడుకునే పనిలో రైతులు
- నష్టనివారణ చర్యల్లో అధికారులు
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతానికి జిల్లా యంత్రాంగం కసరత్తు
- వైద్య శిబిరాలు.. పారిశుద్ధ్య పనులు
- పొంగుతున్న డ్రెయిన్‌లపై ప్రత్యేక దృష్టి



రామచంద్రాపురంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి, కలెక్టర్ ప్రశాంతి



ఆచంటలో గుర్రపుడెక్క తొలగింపు

సాక్షి, భీమవరం: జిల్లాలో మిచాంగ్ తుపాను సృష్టించిన బీభత్సానికి ముంపు బెడద వెంటాడుతూనే ఉంది. వరద నీటితో ప్రధాన డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తుండటం పొలాల్లోని ముంపు నీరు లాగేందుకు ప్రతిబంధకంగా మారింది. పంటను కాపాడుకునే పనిలో రైతులు, నష్టనివారణ చర్యల్లో అధికారులు నిమగ్నమయ్యారు. భారీ వర్షాలతో జిల్లాలో రెండు రోజులుగా యనమదుర్రు, నక్కలు, గొంతేరు డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎర్రకాలువకు ఏజెన్సీ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది.

**ప్రత్యేక పర్యవేక్షణతో..** జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో రైతులు తొలకరి పంటను సాగు చేశారు. తుపాను వచ్చే నాటికి 1.14 లక్షల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. తుపాను హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తమై ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేశారు. వర్షాలు మొదలయ్యే నాటికి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కొనుగోళ్లు, బహిరంగ మార్కెట్ ద్వారా 90 శాతం ధాన్యం ఒబ్బిడి అయ్యింది. రైతుల వద్ద ఉన్న మిగిలిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం జిల్లాలోని 35 వేల ఎకరాల్లోని వరి పంట నేలకొరగ్గా 24,757 ఎకరాలు నీట మునిగాయి. సీఎం జగన్ ఆదేశాల మేరకు అన్ని విధాల రైతులకు అండగా నిలిచేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. వాతావరణం తెరిపివ్వడంతో పొలాల్లోని ముంపు నీటిని బయటకు పంపేందుకు రైతులతో పాటు కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షణలో వ్యవసాయ, ఇరిగేషన్, డ్వామా అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పొక్లయిన్‌లతో కాలువల్లో పూడిక తీయిస్తున్నారు. ఆయిల్ ఇంజన్లు ఉపయోగించి పొలాల్లోని నీటిని తోడే ప్రయత్నం చేస్తున్నారు.

**ఉపాధి కూలీలతో పనులు :** జిల్లాలోని 20 మండలాల పరిధిలో గురువారం 1,282 మంది ఉపాధి కూలీలతో పంట బోదెల్లో పూడికలు తీయించారు. అయితే ఎగువ ప్రాంతాల వరద నీటితో డ్రెయిన్లు పోటెత్తుతుండటంతో పొలాల్లోని ముంపు నీరు లాగడం కష్టంగా మారింది. అత్తిలి మండలంలోని తిరుపతిపురం, వరిగేడు, ఉండి మండలంలోని వెయ్యి ఎకరాల్లోని పంటను ఎర్రకాలువ వరద నీరు ముంచెత్తింది. వరద తగ్గితే ఇప్పటికే చేపట్టిన నష్టనివారణ చర్యలతో కొన్ని గంటల్లోనే ముంపు నీరు బయటకు పోతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సడలింపుల మేరకు ఆఫ్‌లైన్‌లో కొనుగోలు, జీపీఎస్ లేకపోయినా రైతులు సొంత వాహనాల్లో ధాన్యాన్ని తరలించుకోవచ్చునని అధికారులు సూచిస్తున్నారు. పోడూరు మండలంలో తడిసిన ధాన్యం మొలకలు రాకుండా వ్యవసాయాధికారులు రైతులతో పొలాల్లో ఉప్పు ద్రావణం పిచికారీ చేయించారు.

**ముమ్మరంగా సహాయక చర్యలు**

యనమదుర్రు డ్రెయిన్, ఎర్రకాలువకు వరదనీరు పోటెత్తుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అత్తిలి మండలం తిరుపతిపురం, వరిగేడు, ఉండి మండలం యండగండి లాకులు ప్రాంతాలను కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. వీటి పరిధిలో తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలి, పెంటపాడు, గణపవరం, పాలకోడేరు మండలాలు, భీమవరం అర్బన్, రూరల్‌లోని గ్రామాల్లో ముంపునకు గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన పునరావాస చర్యలకు ఆదేశాలిచ్చారు. యనమదుర్రు డ్రెయిన్‌లో వరద పరిస్థితిని పర్యవేక్షించి అప్రమత్తం చేసేందుకు పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ప్రతి కిలోమీటరుకు ఒక వీఆర్‌ఓ, కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. ప్రతి గంటకు పరిస్థితిని అంచనా వేసి సమాచారాన్ని అందించాలని సూచించారు. ప్రజల భద్రత, తరలింపు, ఆహార సరఫరా, వైద్య శిబిరాల ఏర్పాటు, ఇతర ముంపు కార్యకలాపాలు నిర్వహణకు కలెక్టర్ సూచనలిచ్చారు.



పోడూరు మండలంలో ధాన్యం మొలకలు రాకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తున్న రైతు

### 22 వైద్య శిబిరాలు

జిల్లాలోని 19 మండలాల పరిధిలో 113 గ్రామాలు తుపాను ప్రభావానికి గురయ్యాయి. ప్రతికూల వాతావరణం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు చర్యలు చేపట్టారు. నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, భీమవరం, యలమంచిలి, ఆచంట మండలాల్లో గురువారం 22 మెడికల్ క్యాంపుల ద్వారా 7,750 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మిగిలిన గ్రామాల్లోను వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. జ్వరపీడితులను గుర్తించి అవసరమైన వైద్యసాయం అందించేందుకు వలంటీర్లు, ఆరోగ్య సిబ్బందితో గ్రామాల్లో డోర్ టూ డోర్ ఫీవర్ సర్వే చేయిస్తున్నారు. పంచాయతీల ఆధ్వర్యంలో గ్రామాల్లో రక్షిత నీటి క్లోరినేషన్ చేస్తున్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు.



ఫీవర్ సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

### పంట నష్టం అంచనాలకు ఆదేశం

అత్తిలి: తుపాను కారణంగా జిల్లాలో సుమారు 15 వేల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని, పంట నష్టాలను త్వరితగతిన అంచనా వేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆదేశించారు. మండలంలో వరిఘేడు, తిరుపతిపురంలో గురువారం ఆయన పర్యటించి కల్లాల్లోని ధాన్యం రాశులను పరిశీలించారు. ఆరుదల కోడు పొంగి ప్రవహిస్తుండటంతో ముంపు బారిన చేలల్లో పంట నష్టం అంచనా వేయాలన్నారు. ఏ ఒక్కరైతు ఇబ్బంది పడకుండా సీఎం జగన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, పంట నష్టంపై ఎప్పటికప్పుడు ఆరా తీసున్నారన్నారు. యనమదుర్రు డ్రెయిన్ ఉధృతి కారణంగా ఆరుదలకోడు పరివాహక ప్రాంతం ముంపులో ఉన్నందున రైతులకు ఆదుకునేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు.

**ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం**

ఆరుదలకోడు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ఆయన పరిశీలించారు. ఏటా సార్వాసాగులో యనమదుర్రు డ్రెయిన్ ఉధృతికి ఆరుదలకోడు డ్రెయిన్ పొంగి ముంపుతో పంటలు నష్టపోతున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆరుదలకోడు డ్రెయిన్ నీటిని యనమదుర్రు డ్రెయిన్‌లోకి లిఫ్ట్ చేయాలని కోరగా, దీనిపై ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆరుదలకోడు అవుట్‌పాల్ స్లూయిజ్ పాతగేట్ల మరమ్మతులకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తాడేపల్లిగూడెం ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

# సత్వరమే పంట నష్టం అంచనా వేయాలి

**ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు**

నరసాపురం రూరల్: అధికారులు పంట నష్టం అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. గురువారం మండలంలోని చిట్టవరం, గొంది, కొత్తనవరసపురం, పాతనవరసపురం గ్రామాల్లో ఆయన పర్యటించి నీట మునిగిన వరి పొలాలు, కుళ్లిన వరి దుబ్బులను పరిశీలించారు. రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఎకరాకూ నష్టపరిహారం అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. పొలాల్లోని ముంపు నీటిని ఇంజిన్ల ద్వారా బయటకు మళ్లించే ఏర్పాటు చేసుకుంటే ఆయిల్ ఖర్చులు ప్రభుత్వం అందిస్తుందన్నారు. పంట బోదెలు, కాలువల్లో ఉపాధి హామీ కూలీలతో పూడిక తీయించే పనులు చేయిస్తున్నామన్నారు. రైతులే స్వయంగా పొక్లయిన్ల సాయంతో మురుగు డ్రెయిన్లను బాగుచేసుకుంటే ప్రభుత్వమే నిధులు ఇస్తుందన్నారు. దాళ్వా సాగుకు తక్కువ రోజుల్లో పంట దిగుబడి వచ్చే వంగడాలను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు చేసుకోవాలన్నారు. వీటితో పాటు దెబ్బతిన్న ఇళ్లు, కొబ్బరి చెట్లు, ఉద్యాన పంటలు తదితర వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని చీఫ్ విప్ ముదునూరి అధికారులను ఆదేశించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఉంగరా రమేష్‌నాయుడు, తహసీల్దార్ ఫాజిల్, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన వెంట ఉన్నారు.



నరసాపురం రూరల్: వేములదీవిలో బాధితులతో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి



పోడూరు: పెనుమదంలో ముంపు చేలను పరిశీలిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

**ప్రతి రైతునూ ఆదుకుంటాం**

పోడూరు: మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన ప్రతిఒక్క రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి అన్నారు. పెనుమదం, వద్దిపర్రు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి దెబ్బతిన్న వరిచేలను, పెనుమదంలో అల్లిపర వంట బోదె ప్రక్షాళన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావం వల్ల నియోజకవర్గవ్యాప్తంగా రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. రైతులెవ్వరూ అధైర్యపడవద్దనీ, అన్నివిధాలా ఆదుకోవడానికి సీఎం జగన్ పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారన్నారు. మండల కన్వీనర్ పితాని చిన్న, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సొసైటీ చైర్మన్ కొప్రపాటి వీరాస్వామి, గ్రామకమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

# చెరువుకు గండి కొట్టడం అవాస్తవం

- వైఎస్సార్ సీపీ నాయకుడిపై దుష్ప్రచారం
- పంట బోదెకు గండి కొడితే చెరువుకు గండి అంటూ అభాండాలు

ద్వారకాతిరుమల: వరద నీటితో గ్రామం ముంపునకు గురవుతుందని పంట బోదెకు గండి కొడితే, చెరువుకు గండి కొట్టారని దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ నేత, పంగిడిగూడెం సర్పంచ్ ప్రత్తిపాటి మహలక్ష్ముడు ధ్వజమెత్తారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. తుపాను కారణంగా బుధవారం ఉదయం పంగిడిగూడెంలోని మోడల్ డెయిరీ ప్రాంతం జలదిగ్బంధంలో చిక్కుకుంది. వరద నీరు రోడ్డు పక్కన ఉన్న పంట బోదెలోకి వెళుతున్నా.. బోదె చివర అడ్డుకట్ట ఉండటంతో నీరు బయటకు పారడం లేదు. దీంతో తహసీల్దార్ పి.సతీష్, ఎస్సై టి.సుధీర్, సర్పంచ్ మహలక్ష్ముడు పొక్లయిన్‌తో అడ్డుకట్టను తొలగించే ప్రయత్నం చేశారు. అయితే ఒక రైతు అడ్డుకట్ట తొలగిస్తే దిగువ ప్రాంతంలో ఉన్న తన పొలం ముంపు బారిన పడుతుందని అడ్డుకున్నాడు. ఇదే సమయంలో అడ్డుకట్టకు కొద్దిపాటి దూరంలో బోదెకు ఉన్న గండి ద్వారా అప్పటికే నీరు నెమ్మదిగా బయటకు వెళుతోంది. ఆ గండిని పెద్దది చేసి అడ్డుకట్టను విడిచిపెట్టమని రైతు కోరడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. అయితే రైతులపై వైఎస్సార్ సీపీ నాయకుడు దౌర్జన్యం చేసి, చెరువుకు గండి కొట్టి నీటిని పొలాల్లోకి మళ్లించాడని కొందరు దుష్ప్రచారానికి తెరతీశారు. అందులో వాస్తవం లేదని, రహదారిపై నీరు నిలిచిపోయిందని, పంట బోదెకు ఉన్న గండిని పెద్దది చేసినందుకు తనపై విషం కక్కుతున్నారని సర్పంచ్ మహలక్ష్ముడు వాపోతున్నారు. గ్రామంలోని మూడు పంట బోదెల్లో రెండు ఆక్రమణకు గురయ్యాయని, మిగిలిన ఒక బోదెకు అడ్డుకట్ట వేశారని, అధికారులు సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని ఆయన కోరుతున్నారు.



పంగిడిగూడెంలో బోదెలో నుంచి గండి ద్వారా బయటకు వెళుతున్న వరద నీరు

# గుర్రపుడెక్క గుబులు

- మిచాంగ్ తుపానుతో భారీగా కొల్లేరుకు నీరు
- పెదఎడ్లగాడి వంతెన ఖానాలకు అడ్డుగా గుర్రపుడెక్క
- వంతెన వద్ద 7 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఇటీవల రూ.8 లక్షలతో డెక్క తొలగింపు
- ఎగువ గ్రామాలకు ముంపు భయం



పెదఎడ్లగాడి వంతెన వద్ద భారీగా పేరుకుపోయిన గుర్రపుడెక్క

కైకలూరు: గుర్రపుడెక్క కొల్లేరు గ్రామాలకు గుదిబండగా మారుతోంది. మిచాంగ్ తుపానుతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా కొల్లేరుకు వర్షపు నీరు వచ్చి చేరుతోంది. ఇప్పటికే కొల్లేరు నిండుకుండలా కనిపిస్తోంది. అయితే కొల్లేరుకు చేరిన నీటిని సముద్రానికి చేరవేసే ఏకైక మార్గమైన పెదఎడ్లగాడి వంతెన ఖానాలకు గుర్రపుడెక్క అవరోధంగా మారింది. సాధారణంగా వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత కొల్లేరుకు వరద పెరుగుతోంది. ఇప్పటికే పెదఎడ్లగాడి వద్ద 7 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. గతేడాది ఆగస్టులో వచ్చిన వరదలకు వంతెన వద్ద 7.2 అడుగుల నీటి మట్టానికి దిగువన పెనుమాలంక రోడ్డు వరద నీటిలో చిక్కుకుంది.

**67 డ్రెయిన్లు.. 1.10 లక్షల క్యూసెక్కులు**

భారీ వరదల సమయంలో కొల్లేరుకు చేరుతున్నా నీటి ప్రవాహానికి గుర్రపుడెక్క పెద్ద అడ్డుగోడగా మారుతోంది. వరదల సమయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 67 డ్రెయిన్ల ద్వారా 1.10 లక్షల క్యూసెక్కుల నీరు కొల్లేరుకు చేరుతోంది. నీరంతా కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం పెదఎడ్లగాడి, పోల్‌రాజ్ కాలువల ద్వారా కైకలూరు మండలం ఆలపాడు శివారు ఉప్పుటేరు మీదుగా సముద్రంలోకి కలుస్తోంది. వాస్తవానికి కొల్లేరులో నీటిమట్టం 7 అడుగులు ఉంటే 15 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండాలని నిపుణులు సూచించారు. కొల్లేరుకు చేరుతున్న 1.10 లక్షల క్యూసెక్కుల నీటిలో కేవలం 10 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే దిగువకు చేరుతోంది.

**వదలని గుర్రపుడెక్క సమస్య**

ఫోంటెడెరియా క్రాసిప్స్ అనే జాతికి చెందిన గుర్రపుడెక్కను బెంగాల్ టెర్రగా అభివర్ణిస్తారు. ఇవి సునాయాశంగా పెరుగుతాయి. కొల్లేరులోకి బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు, చంద్రయ్య, వల్లూరు, గుండేరు, దోసపాడు, మొండుకోడు, ఏలూరు కాల్వ, ఎస్నేపుల, పందికోడు, పోల్‌రాజ్, కైకలూరు శ్యాంప్ వంటి 67 మేజర్, మైనర్ డ్రెయిన్లు, కాల్వల ద్వారా నీరు చేరుతోంది. నీటి ద్వారా గుర్రపుడెక్క కొట్టుకొస్తోంది. ఇవి కొల్లేరుకు చేరే నీటిని సముద్రానికి పంపించే పెదఎడ్లగాడి వంతెన ఖానాలకు అడ్డుపడుతున్నాయి. ప్రస్తుతం పెదఎడ్లగాడి వంతెన 56 ఖానాల వద్ద గుర్రపుడెక్క పేరుకుపోయి ఉంది. దీంతో నీటి ప్రవాహం కిందకు వెళ్లడం లేదు. ఇదిలా ఉంటే కొల్లేరులో అక్రమ చేపల చెరువుల గట్లు కూడా నీటి ప్రవాహానికి అడ్డువస్తున్నాయి.

**డెక్కను తొలగిస్తాం**



"పెదఎడ్లగాడి వంతెన వద్ద ఈ ఏడాది రూ.8 లక్షలతో మనుషుల సాయంతో గుర్రపుడెక్కను తొలగించాం. ఏటా ప్రధాన సమస్యగా ఇది మారుతోంది. ఎగువ నుంచి భారీగా డెక్క వస్తోంది. నీటి ప్రవాహ వేగం తగ్గడంతో సమీప గ్రామాల రహదారులు ముంపుబారిన పడుతున్నాయి. ప్రస్తుతం అడ్డుగా మారిన గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు చేపడతాం.

– ఇందిరా, డ్రెయినేజీశాఖ, జేఈఈ, కైకలూరు



పెదఎడ్లగాడి ఎగువవైపు ఖానాల వద్ద నీరు

**ఛానలైజేషన్ పరిష్కార మార్గం**

కొల్లేరులో వివిధ మార్గాలను ఛానలైజేషన్ చేసి నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించాలని పలు కమిటీలు సూచించాయి. పెదఎడ్లగాడి నుంచి ఉప్పుటేరు వరకు ఛానలైజేషన్ చేయాలని 1895లో ఇరిగేషన్ ఎస్ఈ హంస్పెన్, 1964లో మిత్రా కమిటీ, 1986లో శ్రీరామకృష్ణయ్య కమిటీలు సూచనలు చేశాయి. కొల్లేరు సరస్సుకు 9 లక్షల ఎకరాల మెట్ట ప్రాంతాల నుంచి, మూడున్నర లక్షల ఎకరాల మాగాణి నుంచి నీరు చేరుతోంది. మొత్తంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 12 మండలాల పరిధిలో 2,22,300 ఎకరాల విస్తీర్ణంలో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. అధికారులు సరైన ప్రణాళికతో కొల్లేరు ఆధునికీకరణ పనులు చేపట్టాలని కొల్లేరు పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

**తమ్మిలేరు నుంచి కొల్లేరులోకి..**

ఏలూరు రూరల్: తుపాను కారణంగా ఎగువన ఖమ్మం జిల్లా, జిల్లాలోని అటవీ, మెట్ట ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు పొంగి వరద నీరు తమ్మిలేరులోకి చేరడంతో ఏలూరులో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇరిగేషన్ అధికారులు కొంతమేర వరద నీటిని తూర్పు లాకులు, పడమట లాకుల మీదుగా కొల్లేరులోకి వదులుతున్నారు. దీంతో కొల్లేరుకు జలకళ వస్తోంది. గత జూలైలో కురిసిన వర్షాలకు కొల్లేరు నిండుకుండలా మారింది. అయితే కొద్దినెలల్లో నీటిమట్టం తగ్గింది. మరలా మూడు రోజులుగా వరదనీరు కొల్లేరులోకి పారడంతో వచ్చే ఫిబ్రవరి వరకూ కొల్లేరు నీటితో కళకళలాడుతుందని ప్రజలు భావిస్తున్నారు.

## క్లుప్తంగా

### జాతీయ ఏకలవ్య పోటీలకు ముగ్గురి ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ అమృత్‌కుమార్

**బుట్టాయగూడెం:** కర్ణాటకలోని మైసూర్‌లో వచ్చే ఏడాది జనవరిలో జరిగే ఏకలవ్య నేషనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌కు తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఇప్పలపాడు ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.అమృత్ కుమార్ చెప్పారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్ అండర్-19 విభాగంలో తమ పాఠశాల విద్యార్థులైన కణితి కార్తిక్, మడకం భరత్, కూరం ఐశ్వర్య అత్యంత ప్రతిభ కనపరచి జాతీయ స్థాయి స్పోర్ట్స్‌మీట్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

### శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.55 కోట్లు


హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

**ద్వారకాతిరుమల:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ నిర్వహించారు. ఈ లెక్కింపులో చినవెంకన్నకు విశేష ఆదాయం సమకూరింది. గడచిన 17 రోజులకు గాను నగదు రూపేణా స్వామివారికి రూ.1,55,92,938 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 159 గ్రాముల బంగారం, 3.650 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దైన పాత రూ.2 వేలు, రూ.వెయ్యి, రూ.500 నోట్ల ద్వారా రూ.18,500 లభించినట్టు చెప్పారు. లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సొంతిల్లులా.. సౌకర్యంగా

- వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలో వసతులపై విదేశీ విద్యార్థులు
- ప్రత్యేక ఆహారం అందిస్తున్నారంటూ సంతోషం
- ఐసీఏఆర్ స్కాలర్‌షిప్‌తో 50 మంది విద్యాభ్యాసం



ఉద్యాన వర్సిటీలోని ఉద్యాన కళాశాల, ఫీల్ ఎట్ హోం కార్యక్రమంలో విదేశీ విద్యార్థులతో ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్ (ఫైల్)

**తాడేపల్లిగూడెం:** విదేశాల నుంచి విద్యను అభ్యసించడానికి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి వచ్చిన విద్యార్థులు ఇక్కడి వసతులు, అందిస్తున్న ఆహారంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది సొంతిల్లే అనిపించేలా వసతులు కల్పించారని చెబుతున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) కేటగిరీలో భారత ప్రభుత్వ ఉపకార వేతనాలతో బీఎస్సీ, ఎమ్మెస్సీ హార్టీకల్చర్ కోర్సులు అభ్యసించడానికి నేపాల్, భూటాన్, శ్రీలంక, ఆఫ్రికా దేశాల నుంచి విద్యార్థులు సుమారు 50 మంది ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, దేశంలో మంచి గుర్తింపు కలిగిన ఉద్యాన విశ్వవిద్యాలయం కావడంతో ఆయా దేశాలు తమ విద్యార్థులను ఇక్కడి ఉద్యాన వర్సిటీలో విద్యను అభ్యసించడానికి ప్రోత్సహిస్తున్నాయి. అంతేకాక విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ఆహారాన్ని వర్సిటీలో సమకూరుస్తున్నారు. వారి కోసం ప్రత్యేక మెనూ అమలు చేస్తున్నారు. వీసీ నివాస గృహంలో ప్రత్యేక వంటకాలను వడ్డిస్తూ ఫీల్ ఎట్ హోం కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

**ప్రత్యేక మెనూ**

ఉద్యాన వర్సిటీలో విద్యనభ్యసించే విదేశాల విద్యార్థులకు ఆయా ప్రాంతాల అభిరుచులకు అనుగుణంగా ఆహార పదార్థాలు అందజేయడంతో పాటు సౌకర్యాలు, ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. వారి ఆహారపు అలవాట్లకు అనుగుణంగా చపాతీ, ఉడకబెట్టిన కూరగాయలు, గుడ్లు వంటి ప్రత్యేక మెనూను అందిస్తున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కోసం ఏసీ వంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు. ప్రతిరోజూ ఆహారంలో చపాతీ ఉండేలా, వాటి తయారీకి చపాతీ మెషీన్‌ను సమకూర్చారు. విదేశీ విద్యార్థులకు ఇక్కడి వాతావరణానికి అనుకూలంగా ఉండే విధంగా రూ.80 లక్షలతో నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు.

### మంచి ఆహారం అందిస్తున్నారు


భూటాన్ తూర్పుప్రాంతం నుంచి వచ్చాను. బీఎస్సీ హార్టీకల్చర్ ఆఖరి సంవత్సరంలో ఉన్నాను. మొదటిసారి ఇంటికి దూరంగా చదువుకోడానికి భారతదేశం వచ్చాను. ఇక్కడ ఉద్యానవర్సిటీలో చదువుకోవడం చాలా గొప్పగా ఉంది. ఒకరి భావాలు ఒకరు పంచుకోవడానికి ఉద్యాన వర్సిటీ మంచి వేదిక. ఇక్కడ ఎండ వేడిమి, ఉక్కపోత సమస్య మాకు ఇబ్బందిగా ఉంటే ఏసీ రూములు ఇచ్చారు. మంచి ఆహారం అందిస్తున్నారు.. ధన్యవాదాలు.

– సంగయ్‌దీచస్, భూటాన్

### ప్రోత్సాహం బాగుంది


ఇతర దేశం నుంచి ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నా, మాకు ఇస్తున్న ప్రోత్సాహం మరువలేం. భిన్న వాతావరణం, విభిన్న మనస్తత్వాలు కలిగిన విద్యార్థులు మాతో మమేకమవుతున్నారు. ఇక్కడ సంస్కృతీ సంప్రదాయం, క్రీడలు అన్నింటిలో వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. భూటాన్, భారత ప్రభుత్వాల ద్వారా మాకు ఇక్కడ విద్యనభ్యసించే మంచి అవకాశం వచ్చింది. ఇక్కడ ఉపకులపతి తీసుకునే ప్రత్యేక శ్రద్ధ మరువలేం.

– సోనం చోడెన్, భూటాన్

### అద్భుతమైన అనుభవం


ఉద్యాన వర్సిటీలో బీఎస్సీ హార్టీకల్చర్ నాలుగో సంవత్సరం చదువుతున్నాను. భారత ప్రభుత్వ ఉపకార వేతనంతో ఇక్కడ చదువగలుగుతున్నాను. ఇక్కడ చదవడం అద్భుతమైన అనుభవం. ఇక్కడ విద్యార్థిగా ఢిల్లీలో చిరుధాన్యాలపై జరిగిన అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వచ్చింది. నా విద్యా ఉన్నతికి ఇక్కడ అందిన ప్రోత్సాహం చిరస్మరణీయం. ఉద్యాన వర్సిటీ ఆహారం రూపంలో అందిస్తున్న ఆతిథ్యం అమోఘం.

– నేయంగ్ ఏషి, భూటాన్

### ఇక్కడ చదవడం గొప్ప అవకాశం


ఉద్యాన వర్సిటీలో ఫ్రూట్‌సైన్సులో ఎంఎస్సీ చదువుతున్నాను. ఇక్కడ అంతా సానుకూల వాతావరణం. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్ (ఐసీసీఆర్) స్కాలర్‌షిప్‌తో చదువుతున్నాను. కొత్త సంస్కృతి, ఆహారపు అలవాట్లు, ఉద్యాన వర్సిటీలోనే చదవడం మహదావకాశంగా భావిస్తున్నాను. విద్యలో భాగంగా తిరుపతి, బెంగళూరు వంటి ప్రాంతాలను సందర్శించాను. బోధకుల బృందం, ముఖ్యంగా ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ అందించిన ప్రోత్సాహం గొప్పది.

– అశోక్ ష, నేపాల్

# వర్జీనియా రైతులను ఆదుకుంటాం


మైసన్నగూడెంలో దెబ్బతిన్న పొగాకు తోటను పరిశీలిస్తున్న యశ్వంత్ కుమార్, బోర్డు అధికారులు

**జంగారెడ్డిగూడెం/కొయ్యలగూడెం:** తుపానుకు దెబ్బతిన్న వర్జీనియా రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తానని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ చెప్పారు. మండలంలోని మైసన్నగూడెం, వేగవరం, చల్లవారిగూడెం, జీలుగుమిల్లి మండలంలోని ములగలంపల్లి, కొయ్యలగూడెం మండలంలోని అచ్చయ్యపాలెం, దిప్పకాయలపాడు, గోపాలపురం వేలం కేంద్రాల పరిధిలో దెబ్బతిన్న వర్జీనియా పొగాకు తోటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. మిచాంగ్ తుపాను కారణంగా ఎస్ఎల్ఎస్ పరిధిలోని రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. పొగాకు తోటల్లో ఇసుక మేటలు వేశాయని, కొన్ని తోటలు నీటిలో మునిగిపోయాయని చైర్మన్‌కు వివరించారు. పూర్తిగా దెబ్బతిన్న రైతులకు మళ్లీ పంట వేసేందుకు పెట్టుబడి నిమిత్తం రూ.1 లక్ష, పాక్షికంగా దెబ్బతిన్న రైతులకు రూ.50 వేలు అదనంగా బ్యాంకు రుణం ఇప్పించాలని రైతులు కోరారు. అలాగే పొగాకు బోర్డు ద్వారా సబ్సిడీపై ఎరువులు ఇప్పించాలని కోరారు. గతంలో ఇటువంటి పరిస్థితి ఎదురైనప్పుడు పొగాకు బోర్డు రైతులను ఆదుకుందని, ఇదే తరహాలో రైతులను మళ్లీ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో బ్యాంకుల ద్వారా రూ.50 వేల అదనపు రుణం, పొగాకు బోర్డు ద్వారా ఎరువులు ఇప్పిస్తానని చైర్మన్ రైతులకు హామీ ఇచ్చారు. అలాగే ఎస్ఎల్ఎస్ పరిధిలో నష్టపోయిన పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని స్థానిక బోర్డు అధికారులను ఆదేశించారు. అలాగే సీటీఆర్ఐ సూచనలు మేరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతు సంఘాల నాయకులు ఘంటసాల గాంధీ, సత్రం వెంకటరావు, కరాటం రెడ్డిబాబు, పరిమి రాంబాబు, అట్లూరి సతీష్, గడ్డమణుగు సత్యనారాయణ, పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య, వేలం కేంద్రం అధికారులు బి.శ్రీహరి, ఎ.సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

**వర్జీనియా సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..**

**జంగారెడ్డిగూడెం:** వర్జీనియా పొగాకు తోటల్లో అధిక వర్షాల అనంతరం తోటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని, వెంటనే సంరక్షణ చర్యలు తీసుకోవాలని వేలం అధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్ర రైతులకు సూచించారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వర్జీనియా పొగాకు పంట సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీటీఆర్ఐ శాస్త్రవేత్తల సాంకేతిక సహకారంతో వేలం అధికారులు గురువారం వివరించారు. పొగాకు పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేత తోటల్లో చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు వేసినప్పుడు కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 శాతం (బ్లెటాక్స్) 20 గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి మొదళ్లలో పోయాలని సూచించారు. అలాగే మొక్క మొదట్లో ఎకరాకు 25 కేజీల అమోనియా సల్ఫేట్ వేయాలని సూచించారు. ఒక శాతం పొటాషియం నైట్రేట్ అనగా 100 గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కలపై పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గిన తరువాత పొగాకు తోటల్లో తెగుళ్లు సోకే అవకాశం ఉందని, లద్దె పురుగు ఎక్కువగా సోకుతుందని, దీనికి ఇమామెక్టిన్ బెంజోయెట్ (ప్రొక్లెమ్) 5 గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి గాని, నోవా ల్యూరాన్ (రిమోన్ 10) 10 మి.లీ మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నల్లకాడ తెగులు కనిపెట్టిన పొలాల్లో మురుగు నీరు బయటకు పోయే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నల్లకాడ తెగులు నివారణకు మైలు తుప్పర ద్రావణం (10 లీటర్ల నీటిలో 20 గ్రాముల కాపర్‌సల్ఫేట్, 20 గ్రా సున్నం) లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 శాతం (బ్లెటాక్స్) 20 గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి మొక్క మొదళ్లలో పోయాలన్నారు. మెటలాక్సిల్ 8 శాతం, మాంకోజెబ్ 64 శాతం (రెడోమిల్) 20గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి మొక్క మొదట్లో పోయాలని సూచించారు.

# 'ఉన్నతి-మహిళా శక్తి'తో సాధికారత

- ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధికి ఊతం
- సున్నా వడ్డీకే రుణాలు, ఆటో రిక్షాల కొనుగోలుకు ప్రోత్సాహం
- జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్
- 11 మంది స్వయం సహాయక మహిళలకు ఆటోలు పంపిణీ


ఏలూరులో స్వయం సహాయక గ్రూపు మహిళలకు పంపిణీ చేసిన ఆటోలో ప్రయాణిస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జేసీ లావణ్యవేణి

**ఏలూరు (మెట్రో):** ఎస్సీ, ఎస్టీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతి-మహిళాశక్తి అనే ప్రత్యేక పథకం ద్వారా వారి జీవనోపాధికి సున్నా వడ్డీకే ఆటో రిక్షాలు అందిస్తోందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం ఉన్నతి-మహిళాశక్తి పథకాన్ని ప్రారంభించి 11 మంది ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆటోలను కలెక్టర్ అందజేశారు. అనంతరం సంబంధిత ఆటోలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ప్రయాణించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల మహిళల జీవనోపాధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతి-మహిళాశక్తి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. మహిళల జీవనోపాధికి ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. ఆటో నడుపుకోవడం ద్వారా రోజువారి ఆదాయంతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వీలుంటుందన్నారు. లబ్ధిదారులపై ఎటువంటి భారం లేకుండా సులభవాయిదాల్లో రుణాలు చెల్లించుకుంటు కుటుంబాలను పోషించుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆటో కొనుగోలు సమయంలో లబ్ధిదారులు 10 శాతం వాటా ధనాన్ని ఎస్‌హెచ్‌జీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తే మిగిలిన 90 శాతం వడ్డీలేని రుణంగా అందిస్తామన్నారు. ఏలూరు జిల్లాలో 12 మంది ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ.37.97 లక్షల విలువైన ఉన్నతి-మహిళా శక్తి పథకం కింద ఆటోలను మంజూరు చేయగా వాటిలో గురువారం 11 మంది మహిళలకు ఆటోలను అందజేశామన్నారు. ఇందుకోసం రూ.36 లక్షలు వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. మహిళల జీవనోపాధికి చేపట్టిన ఈ కార్యక్రమం మిగిలిన మహిళలలో కూడా అత్మవిశ్వాసం కల్పిస్తుందన్నారు. మహిళలు నిర్వహించే ఆటోల్లో మహిళలు, పిల్లలు, ధైర్యంగా ప్రయాణించే అవకాశం ఉంటుందన్నారు. ఆటోలు తీసుకునే మహిళలకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పిస్తామని, వీరికి డీఆర్‌డీఏ, రవాణాశాఖ అధికారులు ద్వారా అవసరమైన సహకారం అందజేస్తామన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు మరింత మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు ముందుకు రావాలన్నారు. కాలుష్య నియంత్రణను దృష్టిలో ఉంచుకుని సీఎన్‌జీ ఆటోలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ సెర్ప్ ఉన్నతి విభాగం ద్వారా మహిళల జీవనోపాధి కల్పించేందుకు మహిళా శక్తి ఆటో పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రస్తుతం 11 ఆటో రిక్షాల పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళలు స్వయం సహాయ సంఘాల సభ్యులై, వయస్సు 20 ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు ఉండి, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఈ పథకానికి అర్హులన్నారు. లబ్ధిదారులే ఆటోలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

**జీవనోపాధికి దోహదం**

దెందులూరు మండలం కొవ్వలి గ్రామ సంఘానికి చెందిన మాత్రపు నిర్మల కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నతి-మహిళాశక్తి పథకంలో వడ్డీలేని రుణంతో కొత్త ఆటో ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం అందించిన సహకారంతో రూ. 3,32,718లతో సీఎన్‌జీ ఆటో కొనుగోలు చేయగా, రూ.3 లక్షలు మహిళా ఉన్నతి కింద వడ్డీలేని రుణం మంజూరు చేశారని, మిగిలిన రూ.33,278 లబ్ధిదారు వాటాకు చెల్లించామని చెప్పారు. తమ కుటుంబం ఆర్థికంగా ఎదగడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి, ఆర్డీఓ శ్రీహరి, బీసీ సంక్షేమాధికారి ఆర్వీ నాగరాణి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ కుమిదినీ సింగ్, మహిళా శక్తి సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

### హైవేలో సర్వీసు రోడ్లు నిర్మించండి

**లోక్‌సభలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్**


**దెందులూరు:** సత్తుపల్లి నుంచి దేవరపల్లి వరకు నిర్మించిన గ్రీన్ ఫీల్డ్ హైవేలో సర్వీసు రోడ్లను నిర్మించాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ లోక్‌సభలో కోరారు. గురువారం ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ 80 కి.మీ మేర నిర్మించిన ఈ హైవేలో సర్వీసు రోడ్లు లేకపోవడం వల్ల రోజువారి పనుల నిర్వహణకు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ హైవేలో 50 కిలోమీటర్ల పరిధిలో కేవలం రెండు ఎగ్జిట్‌లు, రెండు ఎంట్రీలు మాత్రమే ఉన్నాయన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సర్వీసు రోడ్లు నిర్మించాలని కోరారు. సర్వీసు రోడ్ల నిర్మాణానికి స్థలం అందుబాటులో ఉందన్నారు. దీనిపై కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానం ఇస్తూ గ్రీన్‌ఫీల్డ్ హైవేలో సర్వీసు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థిని మృతి

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** కళాశాలకు ద్విచక్రవాహనంపై జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వెళుతుండగా లారీ ఢీకొనడంతో ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు దక్షిణపు వీధికి చెందిన తలారి శ్రీనాగవిజయకుమారి (21) ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ సమీపంలో ఉన్న ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఈ నెల 6వ తేదీన తన స్నేహితురాలైన దక్షిణపువీధికి చెందిన బండి అక్షయ ద్విచక్ర వాహనంపై ఆమెతో కలిసి ఈనెల 6వ తేదీ ఉదయం కళాశాలకు వెళుతోంది. ఏలూరు ఫైర్‌స్టేషన్ వద్ద నరసింహారావుపేటకు చెందిన మరో స్నేహితురాలు నిఖితను కూడా అక్షయ తన మోటారు సైకిల్‌పై ఎక్కించుకుంది. ముగ్గురు కలిసి రాంగ్‌రూట్‌లో కాలేజీకి హైవేపై వెళుతుండగా, రైల్వే బ్రిడ్జి వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన లారీ వీరిని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై మధ్యలో కూర్చున్న విజయకుమారికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ఏలూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ నాగ విజయకుమారి గురువారం రాత్రి చెందింది. విజయకుమారి తల్లి 15 ఏళ్ల క్రితం మరణించగా, తండ్రి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. విజయకుమారి, ఆమె సోదరి నానమ్మ వద్ద ఉంటూ ఇంజినీరింగ్ చదువుతున్నారు. విజయకుమారి మృతితో కళాశాల విషాదఛాయలు అలముకున్నాయి.

# బాల్య వివాహం నిలిపివేత


వధువు తరపు మహిళలకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీఓ సూర్య చక్రవేణి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** చైల్డ్‌లైన్ 1098కి అందిన సమాచారం ఆధారంగా పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం రాత్రి జరగాల్సిన ఓ బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని 9వ వార్డుకు చెందిన 16 ఏళ్ల బాలికను 11వ వార్డుకు చెందిన రాము అనే యువకుడికి ఇచ్చి గురువారం రాత్రి వివాహం చేయాలని ఇరు కుటుంబాలు ముహూర్తం నిర్ణయించాయి. ఈ మేరకు ఇరు కుటుంబాలు ఏర్పాట్లు చేసుకుంటుండగా, సమాచారం అందుకున్న ఐసీడీఎస్, వార్డు సచివాలయం సిబ్బంది, పోలీస్, రెవెన్యూ అధికారులు గురువారం వధువు ఇంటికి వెళ్లి వివాహాన్ని నిలిపివేశారు. వధువు, ఆమె తల్లిదండ్రులను, వరుడు, తల్లిదండ్రులను ఏలూరు డీసీపీఓ సూర్య చక్రవేణి దగ్గరకు పంపి కౌన్సిలింగ్ ఇప్పించారు. పెళ్లికుమార్తెను ఏలూరు దిశ వన్ స్టాప్‌కి తాత్కాలికంగా తరలించారు. ఇరు కుటుంబాలకు బాల్య వివాహాలు వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు. 18 ఏళ్లు వచ్చేవరకు పెళ్లి చేసుకోనని బాలికతో హామీ పత్రం రాయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, పట్టణ ఏఎస్సై, వీఆర్‌ఓ, మహిళా పోలీసులు ఝాన్సీ, అనూషా, అంగన్‌వాడీలు వీరమ్మ, అరుణ హాజరైయారు.

### ప్రతిపక్షాలవి చిల్లర రాజకీయాలు

**పెంటపాడు:** రైతులకు ప్రభుత్వం అండగా ఉండగా ప్రతిపక్షాలు చేస్తున్న చిల్లర రాజకీయాలు మానుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. గురువారం ఆయన పెంటపాడులో మాలమహానాడు సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయకపోగా ఇన్‌పుట్ సబ్సిడీ అందించకుండా రైతులను నట్టేట ముంచిందన్నారు. నేడు టీడీపీ, జనసేన కలిపి రైతులకు ఏదో చేసేలా తుపాను అనంతరం ప్రభుత్వం సహాయ కార్యక్రమాలు చేసిన తరువాత వైఎస్సార్ సీపీపై విమర్శలు చేయడం తగవన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ నేత సీఎం అయితే ఏపీలో టీడీపీ నాయకులు బ్యానర్లు పెట్టి హడావుడి చేయడం ఏమిటో తెలియదన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. రెండోసారి సీఎంగా జగనన్న పాలన కొనసాగుతుందన్నారు. నేడు ప్రజలంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారన్నారు. ఈ విషయం ఆ పార్టీలు గుర్తించాలన్నారు. సునీల్, సతీష్, ఏసురత్నం, గోపి తదితరులు పాల్గొన్నారు.

### నకిలీ చెక్కు కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

**భీమవరం:** బ్యాంకు గ్యారంటీగా ఇచ్చిన సెక్యూరిటీ చెక్కు నకిలీది అని నిరూపణ కావడంతో భీమవరం పట్టణానికి చెందిన కురిశేటి శ్రీరామూర్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ భీమవరం పీజేసీజే కోర్టు జడ్జి ఎ.పవన్‌కుమార్ తీర్పు చెప్పారని వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను గురువారం చెప్పారు. కేసుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2016 అక్టోబర్ 21న ధాన్యం మజూరి నిమిత్తం మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యం ఇవ్వడానికి శ్రీరామమూర్తి అండ్ అదర్స్ ఇండియన్ బ్యాంక్ జారీ చేసిన రూ.3 కోట్ల విలువైన బ్యాంక్ గ్యారంటీగా సెక్యూరిటీ చెక్కును రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌కు ఇచ్చారు. అయితే ఈ చెక్కు నకిలీదిగా తెలియడంతో అప్పటికి సహాయ ధాన్యం కొనుగోలు అధికారి ఎంఎస్ శేషగిరిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై కె.సుధాకరరెడ్డి కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో నిందితుడి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారని శ్రీను చెప్పారు. పీపీ వంశీ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించగా, కోర్టు కానిస్టేబుల్ శ్రీను, చక్రవర్తి సహకరించారని సీఐ తెలిపారు.

### కారు ఢీకొని వృద్ధురాలి మృతి

**ద్వారకాతిరుమల:** పంగిడిగూడెంలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పంగిడిగూడెం గ్రామానికి చెందిన కాలాబత్తుల హేమలత (63) గురువారం ఉదయం కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి నడుచుకుంటూ వెళుతోంది. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా, ద్వారకాతిరుమల నుంచి భీమడోలు వైపు వెళుతున్న శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్‌కు చెందిన ఇన్నోవా కారు ఆమెను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన హేమలతను స్థానికులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు గోపాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

**ఆగిరిపల్లి:** ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు నుంచి కింద పడి ఓ మహిళ తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. నూజివీడుకు చెందిన యశోద (58) ప్రతిరోజు విజయవాడ వెళ్లి పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 4న నూజివీడు నుంచి ఆర్టీసీ బస్సులో విజయవాడ వెళుతుండగా వాంతి వచ్చినట్టు అనిపించగా బస్సు ద్వారం దగ్గర నిలబడింది. ఈక్రమంలో నెక్కలం గొల్లగూడెం గ్రామం వద్ద ప్రమాదవశాత్తు తూలి రోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్ర గాయం కావడంతో డ్రైవర్ 108కి ఫోన్ చేసి వాహనంలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. తన కొడుకు పున్నారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### జగన్నాథపురంలో కుప్పకూలిన తాటాకిల్లు



జగన్నాథపురం గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సర్పంచ్ చంద్రిక

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని జగన్నాథపురం గ్రామ ఎస్సీ ఏరియా చర్చి సమీపంలో గెడ్డం సీతయ్యకు చెందిన తాటాకిల్లు ధ్వంసమైంది. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక పరామర్శించారు. తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం సర్పంచ్ చంద్రికకు విజ్ఞప్తి చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్.శివశంకర్ కూలిన తాటాకింటిని పరిశీలించి, నివేదిక పంపించాలని వీఆర్వోకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో కే.శ్రీనివాస రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జడ్డు ఫణీంద్రకుమార్, వీఆర్వో వై.పద్మావతి, పంచాయతీ గుమస్తా వెంకటేశ్వరరావు, గ్రామ నాయకులు ఉండ్రాజవరపు రాజు పాల్గొన్నారు.

### దోమల నివారణకు చర్యలు



డ్రోన్‌తో దోమల మందు పిచికారీ చేస్తున్న చిత్రం

**తాడేపల్లిగూడెం:** మూడు రోజుల పాటు కురిసిన వానల నేపథ్యంలో దోమలు పెరగకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రెండు రోజుల పాటు వాననీటి మళ్లింపు కార్యక్రమాలు చేపట్టిన అధికారులు, డ్రెయిన్ల అడ్డంకులను తొలగించారు. గురువారం దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ చర్యలు చేపట్టారు. గుర్రపుడెక్క వంటివి నిండి ఉన్న నీటి కుంటల్లో లార్వాలు అభివృద్ధి చెందకుండా ఉండేందుకు గాను డ్రోన్‌తో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ పర్యవేక్షించారు.

### పశువులకు టీకాలు



తాడేపల్లిగూడెం మండలంలో పాడి పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం రూరల్:** తుపాను ప్రభావంతో వచ్చే వాతావరణ మార్పుల నేపథ్యంలో పాడి పశువుల్లో దొమ్మ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా టీకాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎర్రకాలువ పరీవాహక గ్రామాల్లో తొలి ప్రాధాన్యతగా పాడి పశువులకు టీకాలు వేసినట్లు పశుసంవర్ధక శాఖఏడీ డా.బి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ టి.దివ్యశ్రీ, పాడి రైతులు ఉన్నారు.

### కొండ్రుప్రోలు శివాలయంలో లక్ష బిల్వార్చన



కొండ్రుప్రోలు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన చేస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని కొండ్రుప్రోలు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన, లక్ష రుద్రాక్ష పూజ నిర్వహించారు. కార్తీక మాసం, దశమి పర్వదినం సందర్భంగా ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ తెలిపారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

### బియ్యం పంపిణీ

**భీమవరం:** తుపాను కారణంగా ఉపాధి కోల్పోయిన పట్టణంలోని గొల్లవానితిప్పరోడ్డు, ప్రకాష్‌నగర్ కాలనీల్లో యానాదులకు హిందూబంధు ఆధ్వర్యంలో గురువారం బియ్యం పంపిణీ చేశారు. సుమారు 80 కుటుంబాలకు ఐదు కిలోల చొప్పున బియ్యం అందజేశామని ఆర్ఎస్ఎస్ ఉభయగోదావరి జిల్లాల సంచాలక్ మంతెన రామచంద్ర రాజు తెలిపారు. కార్యక్రమంలో మజ్జి మహేష్, ఇళ్ల హరికృష్ణ, వనమ శ్రీకాంత్, కొప్పర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### గరగపర్రు కేసు కొట్టివేత

**భీమవరం:** పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు ఉద్యమంలో పెట్టిన కేసును గురువారం భీమవరం సెకండ్ అడిషనల్ కోర్టులో కొట్టివేసినట్టు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ తెలిపారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నల్లి రాజేష్, కొల్లపు వేణు తదితరులపై 2017లో కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కర్ని జోగయ్య, జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్ బాబు, నాయకులు మోకా నర్సింహారావు, గాది రవి, విప్పర్తి నవీన్, వర్ధనపు మోషే తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# అందరికీ సంక్షేమ పథకాలు



ఇరగవరం: కె ఇల్లిందలపర్రులో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



15వ వార్డులో వలంటీర్లకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**పలు ప్రాంతాల్లో సందడిగా 'వై ఏపీ నీడ్స్ జగన్'**

**ఇరగవరం:** జగన్ పాలనలో సచివాలయాలు కేంద్రంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కె ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున అన్నారు. మండలంలోని కె ఇల్లిందలపర్రు సచివాలయంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లలా భావించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. అందుకే జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గ్రామంలోని కుటుంబలు వద్దకు వెళ్లి చేకురిన లబ్ధి, పథకాలు వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్ట నాగామణి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ అవివేలు మంగ తాయారు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోగి బాబీ, ఎంపీడీవో ఎ శ్రీనివాస్ ఎంపీటీసీ పిల్లి కాంతకుమారి ఈవోపీఆర్డీ పి నరసంహ మూర్తి, కార్యదర్శి టి శేషుబాబు, అధికారులు, మండల, గ్రామ నాయకులు గరికిపాటి సతీష్ బుజ్జి,సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాయపాలెం గ్రామంలో జరిగిన సభలో గృహ సారథులకు కిట్లను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

**పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు**

**తాడేపల్లిగూడెం రూరల్:** పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ విద్య, వైద్య, సంక్షేమం, ఇంటి స్థలాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నివాసాలు లేని వారికి ఇంటి స్థలం ఇవ్వడం రాజు ధర్మమని పేర్కొన్నారు. అందరం కలిసిమెలసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో 1.49లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని, దీని దృష్ట్యా రాష్ట్రానికి జగన్ నాయకత్వం ఎంతైనా అవసరమన్నారు. తొలుత పార్టీ పతాకాన్ని, గ్రామానికి 30 కోట్ల 55లక్షల 55వేల 38 రూపాయలు విలువైన సంక్షేమ పథకాల బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కొట్టు విశాల్, సర్పంచ్ బేదపూడి వెంకటసుబ్బలక్ష్మి, ఉపసర్పంచ్ బేదపూడి వెంకటేశ్వరరావు, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, జడ్డు హరిబాబు, నాయకులు కంఠమని సత్యనారాయణ, నక్కా గంగాధర్, పుట్టా ఉమామహేశ్వరరావు, తాడేపల్లి పండు, గారపాటి చిట్టిరాజు, గజ్జరపు రామకృష్ణ, నల్లూరి శివరామ్, గంజి భాస్కరరావు, ఎస్‌కే.రాజు, పుట్టా పాపారావు, నూనె రామకృష్ణ, ఈవో పీఆర్డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి బి.అప్పారావు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

### ఇంటింటికీ సంక్షేమం జగన్‌కే సాధ్యం

**తాడేపల్లిగూడెంఅర్బన్ :** ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని 15వ వార్డు ఇన్‌చార్జ్ మార్నీడి బాబ్జి అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ప్రజలందరూ మళ్లీ రాష్ట్రానికి జగనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవడానికి ఏఇంటికి వెళ్లిన ప్రజల్లో సంతోషమే కనపడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటమి తప్పదన్నారు. అనంతరం వార్డులో సీఎం జగన్‌మోహనరెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దూద్ బాషా, పత్యాల వెంకటేశ్వరరావు, కర్రి భాస్కరరావు, వట్టి బుజ్జి, బొద్దాని శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వలంటీరు, గృహసారథులు పాల్గొన్నారు.

### కొమ్ముగూడెం సొసైటీని పరిశీలించిన నాబార్డు అధికారులు



తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం సొసైటీని పరిశీలించిన నాబార్డు అధికారుల బృందం

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని కొమ్ముగూడెం సొసైటీని గురువారం నాబార్డు అధికారుల బృందం పరిశీలించింది. సొసైటీల కంప్యూటరీకరణలో భాగంగా కొమ్ముగూడెం సొసైటీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ముంబై నుంచి నాబార్డు అధికారులు, రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంకు,జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, సహకార శాఖ అధికారుల బృందం ఇక్కడకు విచ్చేసి, కంప్యూటీకరణ ద్వారా లావాదేవీలను పరిశీలించారు. సొసైటీ, కంప్యూటర్ల నిర్వహణపట్ల నాబార్డు అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, సీఈవో సీహెచ్ఎస్‌వీ కృష్ణశర్మ, సిబ్బంది ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలోని వన్‌టౌన్ నార్త్ హౌసింగ్ బోర్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రైల్వే ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 8వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. రైల్వే స్టేషన్ రోడ్డు, వెంకటరత్నం ఆస్పత్రి, భూపాల్ నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి





తాడేపల్లిగూడెం మండలంలో పర్యటించిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు

**తాడేపల్లిగూడెం రూరల్:** తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం ఇచ్చి అన్నివిధాల ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా నాయకుడు మామిడి దానవరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మోదుగ గుంట, దండగర్ర, అప్పారావుపేట, మాధవరం, జగన్నాథపురం, నవాబుపాలెం, కొండ్రుప్రోలు, ఉప్పరగూడెం, ఎల్.అగ్రహారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ ఎకరానికి 20 వేలు నష్టపరిహారం సత్వరమే చెల్లించి ఆదుకోవాలన్నారు. సబ్సిడీపై బ్యాంకు రుణాలు, ఎరువులు అందించాలన్నారు.ఈ ధర్నాలో రైతులు మంచాల సత్తిపండు, పుల్లా రత్తయ్య, తీపర్తి శ్రీను, ప్రసాద్, బాలకృష్ణ, రమణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**తాడేపల్లిగూడెం రూరల్:** తుపాను ధాటికి వరి నారుమడి, మినుము చేలలో చేరిన నీటిని బయటకు పంపి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కడియద్ద, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, పుల్లాయగూడెం, అప్పారావుపేట, మాధవరం, నందమూరు గ్రామాల్లో ఆయన పర్యటించి, నీట మునిగిన వరి నారుమడి, మినుము చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ మినుములో నీరు తీసిన తర్వాత బావిస్టన్, మాంకోజెబ్ పురుగు మందును రెండు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. గింజ ఏర్పడే స్థాయిలో ఉంటే 13: 0 : 45 రకం ఎరువును రెండు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. నారుమడి విత్తనాలు కావలసిన రైతులు ఆర్బీకే ఇన్‌చార్జ్ లేదా తనను సంప్రదించవచ్చన్నారు. ఆయన వెంట ఆర్బీకే అసిస్టెంట్లు వీర్రాజు, వంశీ, ధర్మరాజు, గోవర్ధని, సురేష్, ప్రవీణ్ ఉన్నారు.

## ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి



జగన్నాథపురం గ్రామంలో సూపర్ శానిటేషన్‌ను పర్యవేక్షిస్తున్న గ్రామ సర్పంచ్ చంద్రిక

**తాడేపల్లిగూడెం రూరల్:** మిచాంగ్ తుపాను ప్రభావంతో నీరు కలుషితమై అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక సూచించారు. గురువారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారాలు వేయకుండా గ్రామ పారిశుద్ధ్యానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో కే.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జడ్డు ఫణీంద్రకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ పి.రవికుమార్, ఏఎన్ఎంలు బి.రామజ్యోతి, వీఆర్వో వై.పద్మావతి, నాయకులు ఉండ్రాజవరపు రాజు, ముప్పిడి లక్ష్మణరావు, పంచాయతీ సిబ్బంది వెంకటేశ్వరరావు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేయాలి

**తణుకు టౌన్:** గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి తెలిపారు.గురువారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసమావేశానికి ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణదేవి మాట్లాడుతూ మండలంలో పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఏఎంసీ చైర్మన్ సత్తా కృష్ణవేణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నవరత్నాల పేరుతో పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, వాటిని గ్రామాల్లోని ప్రజలకు వివరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పీఎం ఈజీపీ పథకం ద్వారా స్వయం ఉపాధి కోసం అందించే రుణాలను ఈసంవత్సరం నుంచి డ్వాక్రా సంఘాల మహిళలకు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. ఇంకా ఇళ్ల నిర్మాణం చేపట్టని వారికి డ్వాక్రా సంఘాల నుంచి రూ. 35 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు మండల గృహ నిర్మాణ ఏఈ వీ వెంకటరెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ గారపాటి పద్మజలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలి

**ఇరగవరం:** మండలంలో గురువారం ఇరగవరం మండలంలో పలు గ్రామాల్లో వివిధ కార్యక్రమాల్లో రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. రేలంగిలో కాపు వర్తక సంఘం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం రేలంగి క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి కారుమూరి మాట్లాడుతూ క్రీస్తు అనుసరించిన మార్గాన్ని అందరూ అనుసరించి తోటి వారిని ప్రేమించాలన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమాలో కె ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లి రెడ్డి నాగార్జున, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, గ్రామా పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్ నాయకులు వడ్డే మార్కేండేయులు, చేబ్రోలు పెద్ది రాజు, కాపు వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మారంపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



తాడేపల్లిగూడెం మండలం మారంపల్లి గ్రామంలో జరిగిన సభలో మాట్లాడుతున్న సర్పంచ్ పద్మావతి

**తాడేపల్లిగూడెం రూరల్:** ప్రజాసంక్షేమానికి కేంద్ర పథకాలు అమలు చేస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండపల్లి నగేష్ అన్నారు. గురువారం మండలంలోని మారంపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ సరిపల్లి పద్మావతి అధ్యక్షత వహించారు. నగేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిబండి శ్రీనివాస్, గ్రామ బీజేపీ అధ్యక్షుడు రేఖా వెంకటేశ్వరరావు, మహిళా మోర్చా నాయకురాలు రాజేశ్వరి, మాజీ సర్పంచ్ కృష్ణంరాజు, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, మాధవరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన హరికథా సప్తాహం



జానపద గీతాలను ఆలపిస్తున్న సరళ

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ద్వితీయ హరికథా సప్తాహంలో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మినగర్ రోడ్డు నెంబర్ నాలుగులో పురపాలక సంఘం మాజీ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ నివాసం వద్ద గురువారం రాత్రి తొలుత జానపద గీతాలను ధర్మవరంనకు చెందిన సరళ ఆలపించారు. అనంతరం భక్త అంబరీష భాగవత కథను ఏలూరు వాస్తవ్యులు సప్పా భారతి భాగవతారిణి ఆలపించగా, ఆహుతలను కథ అలరించింది. మృదంగంపై సరస్వతుల హనుమంతరావు, వయోలిన్‌పై వీరా శివ ప్రసాద్‌లు సహకరించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు పాల్గొన్నారు.

### దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలు చేస్తున్న యువనేత కొట్టు విశాల్

**పెంటపాడు:** మండలంలోని రావిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ అమ్మవారిని యువనేత కొట్టు విశాల్ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఐక్యంగా ఆలయం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, పెన్నాడ రాఘవ, కైగాల గణపతి, పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### డ్రెయినేజీ నిర్మించాలని నిరసన

**ఆకివీడు:** మండలంలోని అజ్జమూరు గ్రామంలో డ్రెయినేజీ నిర్మించాలని ప్రధాన రహదారి ప్రాంత మహిళలు గురువారం సచివాలయం వద్ద ఆందోళన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరయిన నిధులతో చేపట్టే డ్రెయినేజీ నిర్మాణానికి కొందరు వ్యతిరేకించడంతో పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని మహిళలు కోరారు. ఎంపీడీఓ కందుల వాణి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, ఎస్సై నాగబాబు త్వరలోనే డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేయిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

### మావుళ్లమ్మవారి దీక్ష విరమణ

**భీమవరం (ప్రకాశంచౌక్):** భీమవరం మావుళ్లమ్మవారి దీక్షామండలి మాలధారణ ఇరుముడి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. సుమారు 500 మందిపైగా మాలధారులు ఇరుముడి సమర్పించుకున్నారు. భీమవరంతో పాటు అమలాపురం, తణుకు, నర్సాపురం ప్రాంతాల నుంచి మాలధారులు అమ్మవారికి ఇరుముడులు సమర్పించారు. అమ్మవారికి నెయ్యాభిషేకం ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ చేశారు. సుమారు 1500 మంది భక్తులు అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మ కర్తలు ముత్యాల వెంకట రామారావు, చెల్లంకి నాగ శేషగిరి (గిరి), మావూరి సుందరరావు, రామాయణం సత్యనారాయణ, గోపిశెట్టి విజయలక్ష్మి, కోయ వెంకట లక్ష్మి, నీలాపు విజయ నాగలక్ష్మి, ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

- మావుళ్లమ్మవారి 60వ వార్షిక జాతర మహోత్సవాలు సందర్భంగా రాట ముహూర్తం నిర్వహించారు. నీరుల్లి కూరగాయల వర్తక సంఘం, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



దీక్ష విరమిస్తున్న మావుళ్లమ్మ మాలధారులు

### పునరావాస కేంద్రాలకు 40 కుటుంబాలు

**తణుకు టౌన్:** తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాల కారణంగా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని వయ్యేరు వరద కారణంగా నిరాశ్రయులైన 40 కుటుంబాలకు దువ్వ గ్రామంలో పునరావాసం కేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. దువ్వ గ్రామంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆర్‌డీవో కె చెన్నయ్య గురువారం సాయంత్రం సందర్శించి రాత్రి అందించే భోజనం అందించారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రతి రైతునూ ఆదుకుంటాం



రాచర్ల గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కొట్టు విశాల్

**పెంటపాడు:** రైతులకు ముఖ్యమంత్రి జగనన్న అండగా ఉంటారని యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. గురువారం ఆయన పెంటపాడు మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. నష్టపరిహారం కోసం ముఖ్యమంత్రి జగనన్న రైతులకు నిత్యం అండగా ఉంటారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు రుణమాఫీ చేయలేదన్నారు. నేడు జగనన్న రైతే రాజు అనే నమ్మకంతో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన సంగతిని రైతులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం

**పెంటపాడు:** మండలంలో అలంపురంలో గురువారం సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ వీధుల్లో భారీ జన చైతన్య ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనిక సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకులు తనబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వీరజవాన్ స్థూపానికి సెల్యూట్ చేశారు. సైనిక సంక్షేమం కోసం సైనికుల కుటుంబాలు విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని సైనిక సంక్షేమ నిధికి పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైనిక సంక్షేమసంఘ మాజీ ఉద్యోగులు, టీబీఆర్ సంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలి



దివ్యాంగుల పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలోని భవిత కేంద్రంలో దాతలు సహాయ సహకారాలతో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సుబ్బారావుపేట దివ్యాంగుల పాఠశాలలో దాతల సహాయ సహకారాలతో గురువారం దివ్యాంగుల పిల్లలకు డ్రాయింగ్ బుక్స్, పెన్సిల్స్, బిస్కెట్స్, చాక్లెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరవిందు, భాగ్యశ్రీ, ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, లావణ్య, కీర్తి, షాహీరా, హేమంత్, చైతన్య, పృథ్వీలు పాల్గొన్నారు.

### యోగాతోనే మంచి ఆరోగ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** యోగాతోనే మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని యోగా శిక్షకుడు కరిబండి రామకృష్ణ తెలిపారు. శ్రీ సత్యసాయి నిత్య యోగ సాధన కేంద్రం, పతంజలి యోగాలయం, ఆరా ఫౌండేషన్, అంబికా యోగా సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో ఉచిత అంతర్ముఖ యోగా శిక్షణను నిర్వహించారు. శ్రీ సత్యసాయి ధ్యాన మండలి ఛారిటబుల్ ట్రస్ట్ విజయవాడ నిర్వాహకులు భిక్షమయ్య గురూజీ హాజరైయారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిలను బయిట పడేయాడానికి అంతర్ముఖ యోగా ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బడుగు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### కంటైనర్ దగ్ధంపై కేసు

**భీమవరం అర్బన్:** రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో కంటైనర్ దగ్ధంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపూసలమర్రు గ్రామంలోని ఆనంద ఎంటర్ ప్రైజెస్ వద్ద గత నెల 26న షార్ట్ సర్క్యూట్‌తో కంటైనర్ దగ్ధమైనట్టు ఉద్దరాజు వెంకంట రామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై బి.మోహన్‌రావు తెలిపారు.